

... పటిష్టమైన భద్రత
అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూంలకు పటిష్టమైన భద్రత ఏర్పాటుచేశామని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. 8లో



తాగునీరు వృథా కావొద్దు..
తాగునీరు ఎక్కడ కూడా వృథా కాకుండా పర్యవేక్షించాలని జల వనరుల శాఖ ఎస్ఈ నర్సింగరావు ఉద్యోగులకు సూచించారు. 8లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
43° / 26°

జిల్లాలో ఆదివారం కూడా ఎండల తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం తర్వాత వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేయగా, స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. ఆతర్వాత నిర్వహించిన పల్లకీసేవలో తెలంగాణ, ఏపీలోని పలు ప్రాంతాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈఓ జగన్మోహన్‌రావు, ఆలయ చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులు బల్క్‌గా ఇస్తే సహించేది లేదు..



ఓటర్లకు స్లిప్‌లు అందిస్తున్న అదనపు కలెక్టర్

ముదిగొండ/నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రతీ ఓటరుకు పోల్ స్లిప్ అందించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఆయన పోల్ స్లిప్పుల పంపిణీని పరిశీలించి మాట్లాడారు. బీఎల్‌ఓలు ఈనెల 30వ తేదీలోగా పంపిణీ పూర్తిచేయాలని, ఓటరుకు స్వయంగా ఇవ్వాలే తప్ప ఎక్కడైనా బల్క్‌గా ఇస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాగా, ఎండల నేపథ్యాన ఉదయం 7 గంటల్లోపు, సాయంత్రం చల్లబడ్డాక మాత్రమే పంపిణీ చేయాలని తెలిపారు. ఇక పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌ఓలు సీ విజిల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడమే కాక ఓటర్లకు అవగాహన కల్పించాలని చెప్పారు. తహసీల్దార్లు రామారావు, గౌరీశంకర్, పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓలు శ్రీధర్‌స్వామి, ఎం.యర్రయ్య, ఎంపీఓలు పి.సూర్యనారాయణ, సీ.హెచ్.శివ, ఉద్యోగులు గోపాల్‌రావు, వెంకటేశ్వర్లు, సతీష్, ఏ.మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు



కూలింగ్ గ్లాసెస్ అందజేస్తున్న సీపీ


ఖమ్మంక్రైం: ఎండల నేపథ్యాన ప్రధాన కూడళ్లలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ సిబ్బందికి పోలీసు కమిషనర్ సునీల్‌దత్ శనివారం చలువ కళ్లద్దాలు అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వైపీఎస్ ఆస్పత్రి వైద్యులు యాకూబ్ పాషాసేఫ్ సమకూర్చిన ఈ అద్దాలను సీపీ అందజేసి మాట్లాడారు. నానాటికీ ఎండలు పెరుగుతున్న నేపథ్యాన ట్రాఫిక్ సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు రవి, సాగర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి టీ.టీ. టోర్నీ



ప్రాక్టీస్ చేస్తున్న వివిధ జిల్లాల క్రీడాకారులు

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి ఓపెన్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఆదివారం ప్రారంభం కానుంది. ఈ పోటీలకు రాష్ట్రంలోని పది జిల్లాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరుకానుండగా, కొన్ని జిల్లాల క్రీడాకారులు ఇప్పటికే ఖమ్మం చేరుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే టోర్నీకి హాజరయ్యే క్రీడాకారులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఏర్పాట్లు చేశామని టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి తెలిపారు. అండర్ – 11, 13, 15, 17, 19 బాలబాలికలు, సీనియర్స్ కేటగిరీల్లో నాకౌట్ పద్ధతిలో జరిగే పోటీల్లో విజేతలకు ట్రోఫీలు అందజేస్తామని వెల్లడించారు.



ఖమ్మం లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పార్టీలు గేర్ మార్చాయి. ఈనెల 25వ తేదీతో నామినేషన్ల ప్రక్రియ ముగియగా.. ప్రధాన పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. బరిలో ఉన్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు సుడిగాలి ప్రచారం చేస్తుండగా.. ముఖ్యనేతలు సైతం రోడ్‌షోలు, సభలు, సమావేశాల ద్వారా ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సోమ, మంగళవారాల్లో బస్సుయాత్ర నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రోడ్డు షోల ద్వారా ఆయన ప్రసంగిస్తారు. ఇక బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా సోమవారం కొత్తగూడెంలో జరిగే ప్రచారానికి హాజరుకానున్నారు. అంతే కాక మరికొందరు అగ్రనేతలతో ప్రచారానికి కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సిద్ధమవుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఇక హోరెత్తాల్సిందే..

- జోరు పెంచిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు
- సమావేశాలు, రోడ్డు షోలతో సందడి
- రేపటి నుంచి ఉమ్మడి జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో
- కొత్తగూడెంలో ప్రచారానికి రానున్న జేపీ.నడ్డా
- అగ్రనేతలతో ప్రచారానికి కాంగ్రెస్, బీజేపీ ప్రణాళిక



ఆలస్యమైనా.. దూకుడు

ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించడంలో ఆలస్యం జరగగా తొలినాళ్లలో ప్రచారంపై అంతగా దృష్టి పెట్టలేదు. ఈనెల 24వ తేదీ రాత్రి కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డిని అధిష్టానం ప్రకటించడంతో గురువారం నామినేషన్ దాఖలు చేయగానే ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నామినేషన్ వేసిన రోజు రాత్రే ఖమ్మంలో పలుచోట్ల ప్రచారంలో పాల్గొన్న ఆయన.. శుక్రవారం కూసుమంచి, అశ్వారావుపేటలో, శనివారం ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారానికి మరో 14 రోజుల సమయమే ఉండటంతో పార్టీ అగ్రనేతల పర్యటన కూడా ఉంటుందని నాయకులు చెబుతున్నారు.

స్పీడ్ పెంచిన బీఆర్‌ఎస్

ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ దూసుకెళ్తోంది. ఆ పార్టీ అభ్యర్థిగా నామా నాగేశ్వరరావును ముందుగానే ప్రకటించడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం సాగించారు. నామినేషన్ దాఖలుకు ముందే కార్యకర్తలను కలుస్తూ వారికి దిశానిర్దేశం చేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ తదితరులు అభ్యర్థి నామా నాగేశ్వరరావుతో పాటు ప్రచారంలో పాల్గొంటూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించడమే కాక.. ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలాల ముఖ్యనేతలతో పువ్వాడ సమావేశమయ్యారు. అలాగే, ఈనెల 29, 30వ తేదీల్లో జరిగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ బస్‌యాత్ర, రోడ్‌షో విజయవంతానికి సన్నాహాలు చేస్తున్నారు. గులాబీ దళపతి ప్రచారంతో అభ్యర్థికి అనుకూల పవనాలు వీస్తాయని నాయకులు, కార్యకర్తలు భావిస్తున్నారు.

చుట్టేస్తున్న బీజేపీ అభ్యర్థి

బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు ఉమ్మడి జిల్లాను చుట్టేస్తున్నారు. ఖమ్మం నుంచి ఎలాగైనా ఈసారి సత్తా చాటాలనే ఉద్దేశంతో ఆ పార్టీ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా ముందుగానే అభ్యర్థిని ప్రకటించారు. దీంతో వినోద్‌రావుకు సరిపడా సమయం ఉండడంతో ఇప్పటికే ఒక దఫా ప్రచారం పూర్తిచేశారు. అభ్యర్థితోపాటు తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఇతర నేతలు ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే రోడ్డుషోలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ మరోమారు కేంద్రంలోకి అధికారంలోకి వస్తుందని, ఖమ్మం నుంచి తనను గెలిపిస్తే ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పాటుపడతానంటూ ఓటర్లను ఆకట్టుకునేలా ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్రమోదీ చరిష్మా ఓట్లను తెచ్చిపెడుతుందనే నమ్మకంతో ఆ పార్టీ నేతలు ఉన్నారు.

మిగతా వారు అంతంతే..

ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి నామినేషన్ల స్క్రూటినీ అనంతరం 41 మంది అభ్యర్థులు బరిలో మిగిలారని అధికారులు వెల్లడించారు. ఇందులో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు ఇప్పటికే ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మిగిలిన అభ్యర్థుల మాత్రం ఇంకా రంగంలోకి దిగలేదు. కొన్నిచోట్ల మాత్రమే వీరు ప్రచారం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, సోషలిస్ట్ పార్టీ, బహుజన లెఫ్ట్ పార్టీ, ఆధార్‌పార్టీ, యువతరం, జై భారత్ నేషనల్ పార్టీతో పాటు మరికొన్ని పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. వీరు కూడా ప్రచారాన్ని ప్రారంభిస్తే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎన్నికల వాతావరణం మరింత వేడెక్కనుంది.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

మీ సేవకులుగా ఉంటాం..



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాసరెడ్డి, పక్కన మంత్రి తుమ్మల, అభ్యర్థి రఘురాంరెడ్డి తదితరులు

- పార్టీ శ్రేణుల కష్టఫలితమే మాకు పదవులు
- రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే లక్ష్యం
- రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిద్దాం
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రులు పొంగులేటి, తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్/ఖమ్మం రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నో కష్టనష్టాలకోర్చి తమను గెలిపించారని.. వారికి తాము ఎప్పటికీ సేవకులుగా ఉంటామని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. కార్యకర్తల కష్టఫలితంతోనే తమకు పదవులు దక్కాయని తెలిపారు. ఖమ్మంతో పాటు ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయపురంలో శనివారం నిర్వహించిన ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో మంత్రులు పాల్గొని మాట్లాడారు.

డబుల్ మెజార్టీ ఇద్దాం..

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గడిచిన ఎన్నికల్లో మార్పు కావాలి.. ఇందిరమ్మ రాజ్యం రావాలని పార్టీ శ్రేణులు కోరుకుని తమను గెలిపించడం ద్వారా గత పాలకుల చెంప చెల్లుమనిపించారని తెలిపారు. కార్యకర్తల చలువతోనే కేబినెట్‌లో జిల్లా నుంచి ముగ్గురికి పదవులు దక్కాయని చెప్పారు. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అంతకు రెట్టింపు మెజార్టీతో గెలిపించాలని కోరారు. తద్వారా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన గాంధీ కుటుంబంలో రాహుల్‌గాంధీని ప్రధాని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు రఘురాంరెడ్డి, బలరాంనాయక్ విజయానికి రానున్న సమయం శ్రమించాలని పిలుపునిచ్చారు. అనంతరం మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అధిష్టానం అనేక చర్చల అనంతరం అందరికి కావాల్సిన రామసహాయం రఘురాంరెడ్డిని అభ్యర్థిగా ఎంపిక చేసిందని చెప్పారు. ఈమేరకు విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా అక్షింతలు, దీపాలతో కాలం వెళ్లబుచ్చిన బీజేపీని గద్దె దించి రాహుల్‌ను ప్రధానిగా చేసేందుకు రఘురాంరెడ్డిని గెలిపించాలని కోరారు. కాగా, రాష్ట్రంలో గత పాలకులు అన్ని రంగాలను భ్రష్టు పట్టించినా ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన కృషిచేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఆయోధ్యలో రామాలయం కట్టి బీజేపీ పార్టీ ఓట్లు అడుగుతోందని.. తాము సైతం మరిపెడలో అతిపెద్ద రామాలయాన్ని నిర్మించామని తెలిపారు. తనను దొర అని చెబుతున్న బీఆర్‌ఎస్ నాయకులు.. మరిపెడ, చేగొమ్మలో తమ ఆస్తులను ప్రజల అవసరాల కోసం ఇచ్చిన విషయాన్ని గుర్తించాలని సూచించారు. ఎంపీగా తనను గెలిపిస్తే ఖమ్మం ప్రజల సేవకుడిగా మిగిలిపోతానని తెలిపారు. ఈసమావేశాల్లో సీపీఎం, సీపీఐ నాయకులు కూడా పాల్గొని మాట్లాడారు. కాగా, ఖమ్మంలో జరిగిన సమావేశంలో వివిధ డివిజన్ల నుండి కాంగ్రెస్‌లో చేరేందుకు పలువురు రాగా... పాత నాయకులు అభ్యంతరం తెలపడంతో కాసేపు వాగ్వాదం జరిగింది. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావీద్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ నాయకులు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, సాధు రమేష్‌రెడ్డి, చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, రామసహాయం వెంకటరెడ్డి, నరేష్‌రెడ్డి, అశోక్‌గౌడ్, మద్ది శ్రీనివాసరెడ్డి, బెల్లం శ్రీనివాస్, వజ్జారమ్య, సలాం, ఎర్రా శ్రీకాంత్, విక్రమ్, దండి సురేష్, ఎండీ.మౌలానా, నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కొత్తగూడెంకు జేపీ నడ్డా

మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి

ఖమ్మం మామిళ్లగూడెం: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంకు సోమవారం బీజేపీ జాతీయ అధ్యక్షుడు జే.పీ.నడ్డా రానున్నారని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. ఖమ్మంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, లోక్‌సభ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుతో కలిసి శనివారం విలేకరులతో మాట్లాడారు. కొత్తగూడెంలో జేపీ.నడ్డా పాల్గొననున్న ప్రచార సభకు పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. కాగా, మోదీ నేతృత్వాన అమలవుతున్న సంక్షేమ పథకాలే బీజేపీని మరోమారు గెలిపిస్తాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు గెలవడమే కాక ఖమ్మంలోనూ విజయం సాధిస్తామన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో పూర్తి గా విఫలమైందని విమర్శించారు. ఈవిషయాన్ని గుర్తించిన ప్రజలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పడమే కాక వినోద్‌రావును గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్యాంరాథోడ్, నున్నా రవి, నాయకులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, దొంగల సత్యనారాయణ, ఉపేందర్ గౌడ్, శ్యాం పాల్గొన్నారు.

బీజేపీతోనే బీసీలకు సామాజిక న్యాయం

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీతోనే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని పార్టీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరూగౌడ్, రేఖ సత్యనారాయణ యాదవ్ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీ ప్రధానిగా మోదీ బీసీలకు న్యాయం చేస్తారని తెలిపారు. కాగా, ఖమ్మం 37వ డివిజన్‌కు చెందిన యోగా గురువు జ్ఞాన స్వరూప మిశ్రాను వినోద్‌రావు కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే, ఖమ్మం త్రీ టౌన్‌లో జరిగిన రోడ్డుషోలో కూడా వినోద్‌రావు మాట్లాడారు. ఈకార్యక్రమాల్లో మాజీ మంత్రి విజయరామారావు, నాయకులు శ్రీనివాస్, భానుప్రకాశ్, జ్వాలా నర్సింహారావు, రుద్ర మాధవ్, బోయినపల్లి చంద్రశేఖర్, సుధాకర్, అల్లిక అంజయ్య, సరస్వతి, మార్తి వీరభద్రప్రసాద్, పి.పద్మావతి, లక్ష్మీనారాయణ, ధర్మేందర్, పసుమర్తి సంతోష్, శ్యామ్, బండారి శ్రీనివాసరావు, మృత్యుంజయరావు, కిషోర్, ప్రవీణ్, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, పక్కన అభ్యర్థి వినోద్‌రావు, నాయకులు

పంటలను ఎండబెట్టిన కాంగ్రెస్

- నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులకు తీరని నష్టం
- కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేద్దాం
- ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ, ఎమ్మెల్సీ తాత

ఖమ్మంమయూరిసెంటర్: ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. సాగునీరు ఇవ్వకుండా పంటలను ఎండబెట్టి రైతులకు నష్టం వాటిల్లేలా చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి లోక్‌సభ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికకు తక్కువ సమయం ఉన్నందున కాంగ్రెస్ మోసాలను బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీ, మైనార్టీ, లంబాడీ వర్గాలకు చెందిన ఒక్కరిని కూడా మంత్రివర్గంలోకి తీసుకోకపోగా.. లోక్‌సభ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటు కేటాయించలేదని తెలిపారు. కాగా, తెలంగాణ చరిత్ర, తెలంగాణ జాతిపిత కేసీఆర్ చేసిన అభివృద్ధిని తుడిచేయాలనుకునే వారి కుట్రలు సాగవని చెప్పారు. కాగా, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగాఈనెల 29న ఖమ్మంలో జరిగే రోడ్డు షోకు కేసీఆర్ హాజరవుతున్నందున పార్టీ శ్రేణులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఖమ్మంలోని మయూరిసెంటర్ నుండి జెడ్పీ సెంటర్ వరకు రోడ్డుషో సాగుతుందని తెలిపారు. అలాగే, ఎంపీగా నామ నాగేశ్వరరావు విజయానికి అందరూ కృషి చేయాలని, తద్వారా తెలంగాణతో పాటు జిల్లాకు అత్యధిక నిధులు సాధిస్తారని చెప్పారు. అనంతరం నామ మాట్లాడుతూ ఎంపీగా తాను జిల్లాకు జాతీయ రహదారులు, నవోదయ స్కూల్, మెడికల్ కళాశాల తీసుకొచ్చానని తెలిపారు. పార్లమెంట్ వేదికగా జిల్లా, రాష్ట్ర సమస్యలపై మాట్లాడిన ఏకైక సభ్యుడిని తానేనని చెప్పారు.

ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

బీఆర్‌ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, నాయకులు, కార్పొరేటర్లు పగడాల నాగరాజు, బెల్లం వేణు, గుండాల కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, బిచ్చాల తిరుమలరావు, మేకల సుగుణారావు, ముక్తేశ్వరరావు, మల్బూర్, పిడతల రామూర్తి, చింతల వెంకటేశ్వర్లు, బొమ్మెర రాంమూర్తి, పగడాల నరేందర్, గుండ్లపల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, మాజీ మంత్రి పువ్వాడ, ఎంపీ అభ్యర్థి నామ, తదితరులు

ఢిల్లీ గడ్డపై జెండా!

గతం

సత్తుపల్లి నియోజకవర్గ కేంద్రంగా జిల్లా రాజకీయాలు కొనసాగడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ప్రాంతానికి చెందిన ముగ్గురు నేతలు ఐదు సార్లు ఎంపీలుగా గెలిచారు. నియోజకవర్గంలోని పెనుబల్లి మండలం బయన్నగూడెంకు చెందిన జలగం కొండలరావు, జలగం వెంగళరావు వరుసగా రెండుసార్లు ఖమ్మం ఎంపీలుగా గెలిచారు. జలగం వెంగళరావు రాజీవ్‌గాంధీ మంత్రివర్గంలో పరిశ్రమల శాఖ మంత్రిగా పనిచేశారు. కొండలరావు, వెంగళరావు జిల్లా రాజకీయాల్లోనే కాక రాష్ట్ర రాజకీయాల్లోనూ తమదైన ముద్ర వేశారు. ఇక కల్లూరు మండలం నారాయణపురానికి చెందిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం ఓమారు ఎంపీగా గెలిచారు.


– సత్తుపల్లి

సత్తుపల్లి నుంచి ముగ్గురు ఎంపీలు

- జలగం కుటుంబానికి నాలుగు సార్లు విజయం
- ఓసారి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్నిక
- సీఎం, కేంద్రమంత్రి, రాష్ట్ర మంత్రులను అందించిన సత్తుపల్లి




జలగం కొండలరావు




జలగం కుటుంబం నుంచి జలగం కొండలరావు తొలిసారిగా ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 1977లో సమీప సీపీఎం ప్రత్యర్థి యలమంచిలి రాధాకృష్ణమూర్తిపై పోటీ చేసి గెలిచారు. ఆపై 1980లో సామినేని ఉపేంద్రయ్య(కాంగ్రెస్ యూ)పైనా విజయం సాధించారు. అంతేకాక సత్తుపల్లి నుంచి తొలి ఎమ్మెల్యేగా గెలిచిన కొండలరావు జిల్లా పరిషత్ చైర్మన్‌గా సైతం పనిచేశారు.

జలగం వెంగళరావు



జలగం వెంగళరావు కుటుంబానికి జిల్లాలో ప్రత్యేక స్థానం ఉంది. వెంగళరావు 1984 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి నల్లమల గిరిప్రసాదరావుపై, 1989లో సీపీఎం అభ్యర్థి యలమంచిలి రాధాకృష్ణమూర్తిపై విజయం సాధించారు. అంతకుముందు 1969లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రి వర్గంలో హోంమంత్రిగా పనిచేసిన ఆయన... 1973 మొదలు 1978 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నిర్మాణం, భద్రాచలం, పాల్వంచలో పరిశ్రమల స్థాపన ఆయన హయాంలోనే జరిగింది. ఖమ్మంలో కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయం సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు వెంగళరావు హయాంలోనే నిర్మించారు. ఇక జలగం వెంగళరావు కుమారులు ప్రసాదరావు, వెంకటరావు ఆయన రాజకీయ వారసత్వాన్ని కొనసాగించారు. ప్రసాదరావు ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉన్నా వెంకటరావు ఇటీవలే బీజేపీలో చేరారు.

పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పొంగులేటి శ్రీనివాసరెడ్డి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఆశీస్సులతో 2014లో ఖమ్మం ఎంపీగా గెలిచారు. తొలి ప్రయత్నంలోనే వైఎస్సార్ సీపీ నుంచి ఖమ్మం ఎంపీగా విజయం సాధించిన ఆయన చరిత్ర సృష్టించారు. ఆయనతో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలను గెలిపించుకున్నారు. ఆతర్వాత బీఆర్‌ఎస్‌లో చేరినా 2019 ఎన్నికల్లో టికెట్ దక్కలేదు. ఈమేరకు 2023లో బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి పొంగులేటి.. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి ఏ ఒక్కరిని అసెంబ్లీ గేటు తాకనివ్వనని శపథం చేసి జిల్లా రాజకీయాల్లో వేడి పుట్టించారు. ఆపై పాలేరు ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

క్లుప్తంగా

ఓటు హక్కు వినియోగించుకోండి


ఓటరు ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: వచ్చేనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యాన ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కు వినియోగం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారితో అదనపు కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. డీఆర్వో రాజేశ్వరి, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఉపాధి కల్పనాధికారి కె.శ్రీరామ్, జిల్లా సంక్షేమాధికారి రాంగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డీఏఓ తనిఖీ


పెండిప్రోలులో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న డీఏఓ

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిండిప్రోలు, దమ్మాయిగూడెం, పాతర్లపాడు, సుబ్లేడు, బచ్చోడు, రాజారం, బీరోలు గ్రామాల్లోని దుకాణాల్లో స్టాక్ రిజిస్టరు, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనుమతి లేని ఎరువులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో ఎన్‌ఎంసీ బృందం

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కాలేజీని నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) బృందం శనివారం సందర్శించింది. కాలేజీ ప్రారంభమై మొదటి ఏడాది పూర్తికావొస్తుండగా, రెండో బ్యాచ్ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడమే కాక మొదటి సంవత్సరం పూర్తిచేసే వారికి సెకండియర్ తరగతులు నిర్వహించాల్సి ఉంది. ఈనేపథ్యాన కళాశాలలో సౌకర్యాలు, వసతులు, తరగతి గదులను బృందం పరిశీలించింది. అనంతరం కాలేజీ అధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు బృందం పర్యటనను పర్యవేక్షించారు.

తాగునీరు వృథా కాకుండా పర్యవేక్షణ


గేట్ల వద్ద పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

కూసుమంచి: ఎండలు పెరుగుతున్న నేపథ్యాన తాగునీటికి కొరత రాకుండా అధికారులు పర్యవేక్షించాలని జల వనరుల శాఖ ఎస్ఈ నర్సింగరావు సూచించారు. మండలంలోని పాలేరు రిజర్వాయర్‌ను శనివారం ఆయన ఈఈ మంగళంపూడి వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటి నిల్వ, సరఫరా వివరాలు తెలుసుకున్న ఆయన ఎక్కడ కూడా వృథా కాకుండా చూడాలని తెలిపారు. అనంతరం అలుగుల ప్రాంతాన్ని పరిశీలించి పనులపై ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. అలాగే, రిజర్వాయర్ గేట్ల ప్రాంతాన్ని కూడా ఎస్ఈ పరిశీలించారు. డీఈఈ రత్నకుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆశీలు రగడపై సమావేశం

భద్రాచలంఅర్బన్: గడిచిన కొద్దిరోజులుగా భద్రాచలం గ్రామపంచాయతీ ఆధ్వర్యాన టెండర్ ద్వారా నిర్వహిస్తున్న పార్కింగ్ ఆశీలు వసూళ్లకు సంబంధించి వివిధ శాఖల అధికారులు శనివారం సమావేశమయ్యారు. ఈ అంశంలో దేవస్థానం, గ్రామపంచాయతీ మధ్య వివాదం నెలకొనగా, పోలీసులు, దేవస్థానం, గ్రామపంచాయతీ అధికారులు దేవస్థానం ఈఓ కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ మేరకు పార్కింగ్‌కు సంబంధించి నిర్దేశించిన ప్రదేశాల్లోనే భక్తులు తమ వాహనాలను పార్కింగ్ చేసేలా చూడాలని నిర్ణయించారు. దీంతో రామాలయం ఆవరణలో ఏర్పాటు చేయించిన ఫ్రీ పార్కింగ్ ఫ్లెక్సీలను తొలగించేందుకు దేవస్థానం ఈఓ రమాదేవి సుముఖత వ్యక్తం చేశారు. కాగా, గ్రామపంచాయతీ ఆధ్వర్యాన ఆశీలు పేరిట ఎక్కువ నగదు వసూలు చేస్తుండడంతో దేవస్థానం ఈఓ ఆధ్వర్యాన భక్తుల కోసం పలు ప్రదేశాల్లో ఫ్రీ పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయించారు. దీంతో భక్తులు ఆనందం వ్యక్తం చేయగా, ఆశీలు కాంట్రాక్ట్ దక్కించుకున్న కాంట్రాక్టర్ అభ్యంతరం తెలపడంతో వివాదం నెలకొనగా.. అధికారులతో చర్చలతో సమస్య పరిష్కారమైంది.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174


బ్యాటింగ్ చేస్తున్న రఘురాంరెడ్డి

ప్రచార పర్వం

కొడితే సిక్స్ !

లోక్‌సభ ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి జిల్లా కేంద్రంలో శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఉదయమే పటేల్ స్టేడియానికి వెళ్లిన ఆయన వాకింగ్ చేస్తున్న వారితో పాటు క్రికెట్ ఆడుతున్న యువతను కలిసి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అక్కడ కాసేపు బ్యాటింగ్ చేసిన రఘురాంరెడ్డి.. తానూ క్రికెట్ క్రీడాకారుడినేనని తెలిపారు. అలాగే, ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడి క్రీడాకారులను పలకరించారు. అనంతరం టీడీపీ కార్యాలయం ఎదుట హోటల్‌లో టీ తయారుచేశారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణతో పాటు జావీద్, మిక్కిలినేని మంజుల, నరేందర్, కొత్తా సీతారాములు, ముప్వా విజయ్‌బాబు, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మద్దినేని స్వర్ణకుమారి, మలీదు నాగేశ్వరరావు, వడ్డెబోయిన శ్రీనివాస్, మద్ది కిషోర్‌రెడ్డి, నెల్లూరి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. – ఖమ్మం వన్‌టౌన్


పెద్దమ్మతల్లి సన్నిధిలో మంత్రి పొంగులేటి, రఘురాంరెడ్డి

దీవించు తల్లీ..

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి పాల్వంచలోని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. వారికి అమ్మవారి శేష వస్త్రాలు, ప్రసాదాలను అర్చకులు అందించారు. -పాల్వంచరూరల్

అంతకు ముందు.. ఆ తర్వాత

- తెలంగాణ ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ వర్సెస్ కమ్యూనిస్టులు
- ప్రత్యేకం రాష్ట్రం ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్
- భద్రాచలం–మహబూబాబాద్ సెగ్మెంట్‌లో మారిన రాజకీయ స్వరూపం

భద్రాచలం: పూర్వ భద్రాచలం, నూతన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రాజకీయ ముఖచిత్రం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు, తర్వాత అన్న చందంగా మారింది. పునర్విభజనకు ముందు ఉన్న భద్రాచలం పార్లమెంటరీ నియోయజకవర్గంలో కాంగ్రెస్ కొన్నిసార్లు, మరికొన్ని సార్లు కమ్యూనిస్టులైన సీపీఐ, సీపీఎంలు విజయం సాధించాయి. పునర్విభజన అనంతరం ఏర్పడిన మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో రాజకీయం తారుమారైంది. కమ్యూనిస్టులు కనుచూపు మేరలో లేకపోగా, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ పాగా వేసింది. అప్పటి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల నడుమే తీవ్ర పోటీ నెలకొంటోంది.

ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..
మే 13న పార్లమెంట్ ఎన్నికలు జరగనుండగా, ఇప్పటికే నామినేషన్ల ఘట్టం, స్క్రూటినీ పూర్తయింది. కాంగ్రెస్ తరఫున పోరిక బలరాం నాయక్, బీఆర్ఎస్ తరుఫున మాలోత్ కవిత, బీజేపీ తరఫున అజ్మీరా సీతారాం నాయక్‌లు బరిలో నిలిచారు. బలరాం నాయక్ మూడోసారి, కవిత రెండో సారి, అజ్మీరా సీతారాం నాయక్ రెండో సారి పోటీలో నిలిచారు.


రాధాభాయి ఆనందరావు


సోడె రామయ్య


కర్రెద్దుల కమలకుమారి


దుంపా మేరి విజయకుమారి

కాంగ్రెస్ కోటలో కమ్యూనిస్టుల పాగా


మిడియం బాబూరావు

భద్రాచలం పార్లమెంటు స్థానం 1967లో ఏర్పడింది. ఆవిర్భావం నుంచి వరుసగా నాలుగుసార్లు కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. 1967, 1971, 1977, 1980లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి బి.రాధాబాయి ఆనందరావు వరుసగా నాలుగుసార్లు గెలిచారు. ఆ తర్వాత 1984 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి సోడె రామయ్య గెలుపొందారు. అనంతరం 1989, 1991 ఎన్నికలలో మళ్లీ కాంగ్రెస్ తరఫున కర్రెద్దుల కమల కుమారి గెలిచారు. మళ్లీ 1996,1998 ఎన్నికలలో సీపీఐ తరఫున సోడె రామయ్య రెండుసార్లు, 1999లో టీడీపీ అభ్యర్థి దుంపా మేరి విజయకుమారి, 2004లో సీపీఎం అభ్యర్థి మిడియం బాబూరావు గెలుపొందారు. పూర్వ భద్రాచలం నియోజకవర్గంలో 11 సార్లు ఎన్నికలు జరగగా కాంగ్రెస్ ఆరు సార్లు, సీపీఐ మూడు సార్లు, సీపీఎం, టీడీపీ ఒక్కో సారి గెలిచాయి. ఇలా ప్రధానంగా కాంగ్రెస్, కమ్యూనిస్టుల మధ్య పోరు కొనసాగింది.

గతం

తెలంగాణ ఏర్పాటుతో తారుమారు

నియోజకవర్గాల పునర్విభజనలో భద్రాచలం పార్లమెంటరీ నియోజకవర్గం రద్దయి మహబూబాబాద్ నియోజకవర్గం ఏర్పడింది. దీనికితోడు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన బీఆర్ఎస్ పార్టీ రాకతో.. రాజకీయం తారుమారయింది. 2009 ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థిపై కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ గెలుపొందారు. ఇక రాష్ట్ర విభజన అనంతరం జరిగిన 2014, 2019 ఎన్నికల్లో రెండు సార్లు కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులే గెలిచారు. తొలిసారి అజ్మీరా సీతారాం నాయక్ గెలవగా, మలిసారి మాలోత్ కవిత విజయం సాధించారు. ఇలా రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్‌గా రాజకీయం మారింది. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టులు కాంగ్రెస్ అభ్యర్థులకే మద్దతు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో పునర్విభజనకు ముందు నువ్వా నేనా అనే రీతిలో ఉన్న కమ్యూనిస్టు పార్టీలు ప్రస్తుతం కనీసం పోటీలో నిలబడే పరిస్థితిలో లేవని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.


పోరిక బలరాంనాయక్


అజ్మీరా సీతారాం నాయక్


మాలోత్ కవిత

స్ట్రాంగ్ రూంల్లో పటిష్టమైన భద్రత

వైరా, సత్తుపల్లిలో పరిశీలించిన అధికారులు

వైరా: లోక్‌సభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్‌రూంల వద్ద పటిష్టమైన భద్రత కల్పించినట్లు ఏర్పాట్లు చేసినట్లు ఖమ్మం రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ వీ.పీ.గౌతమ్ తెలిపారు. ఎన్నికల పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి.కోల్టేతో కలిసి శనివారం ఆయన వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, సత్తుపల్లిలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌లు, కమీషనింగ్ గదుల్లో ఏర్పాట్లు, భద్రతపై ఆరా తీశారు. అలాగే, సత్తుపల్లి మండలం కిష్టారంలోని పోలింగ్ కేంద్రం, మేడిశెట్టివారిపాలెంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులను తనిఖీ అధికారులకు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేంద్రగౌడ్, ఏసీపీ ఏ.రఘు, తహసీల్దార్ యోగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, ఎంపీడీఓ నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ డీఈఈ రాములు, ఆర్ఐలు నరేష్, జానీమియా, డీటీలు శివకుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.


సత్తుపల్లి స్ట్రాంగ్‌రూంలో భద్రతపై ఆరా తీస్తున్న కలెక్టర్ గౌతమ్, ఎన్నికల పరిశీలకుడు సంజయ్

క్రీడా శిక్షణ శిబిరాలకు వేళాయె..



- వచ్చేనెల 1నుంచి నెల పాటు నిర్వహణ
- ఖమ్మంలో 23, గ్రామీణ ప్రాంతాల్లో 17 కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం స్పోర్ట్స్: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యాన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు జిల్లా యువజన, క్రీడల శాఖ సిద్ధమవుతోంది. వచ్చేనెల 1నుంచి 31వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు కొనసాగనుండగా, వివిధ క్రీడాంశాల్లో ఔత్సాహిక క్రీడారులను గుర్తించే ప్రక్రియకు శ్రీకారం చుడతారు. ఇప్పటికే జిల్లాలోని కల్లూరు, వైరా, బోనకల్, ముదిగొండ, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం, నేలకొండపల్లి, మధిర, సత్తుపల్లి కేంద్రాల్లో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుల ఆధ్వర్యాన శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండగా పలువురు హాజరవుతున్నారు.

సీనియర్లతో శిక్షణ
ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో అథ్లెటిక్స్, వాలీబాల్ క్రీడాంశాలకు మాత్రమే స్పోర్ట్స్ అథారిటీ నుంచి శిక్షకులు ఉన్నారు. ఇవికాక ఫుట్‌బాల్, కబడ్డీ, ఖో–ఖో, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, లాన్ టెన్నిస్, హాకీ, ఉషూ, కరాటే, బ్యాడ్మింటన్, స్కేటింగ్, క్రికెట్, చెస్, రైఫిల్ షూటింగ్‌ల్లో సీనియర్ క్రీడాకారులను కోచ్‌లుగా నియమించి జిల్లా యువజన, క్రీడా శాఖ శిక్షణ ఇప్పించనుంది. అలాగే, గ్రామీణ ప్రాంతాల్లోనూ ఔత్సాహికులను శిక్షకులు నియమించనున్నారు. వీరికి గౌరవ వేతనం అందించడంతో పాటు క్రీడా సామగ్రి కూడా సమకూరుస్తారు. మొత్తంగా జిల్లా కేంద్రంలో 23, గ్రామీణ ప్రాంతాల్లో 17 శిబిరాల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు.

ఔత్సాహికులను గుర్తిస్తాం..



వేసవి క్రీడా శిక్షణా శిబిరాలల్లో ఔత్సాహికులకు శిక్షణ ఇచ్చేందకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శిబిరాలు ముగిశాక మెరుగైన ప్రతిభ కనబచ్చే వారిని గుర్తించి నిత్యం ప్రాక్టీస్‌కు రప్పించాలని భావిస్తున్నాం. జిల్లాలో క్రీడా శిబిరాల నిర్వహణకు సామగ్రి సిద్ధం చేశాం. ఇటీవల నిర్మించిన మినీ స్టేడియంలను కూడా అందుబాటులోకి తీసుకొస్తాం. క్రీడా శిబిరాలను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ తెలంగాణ(శాట్స్)తో జిల్లా యువజన, క్రీడా శాఖ పర్యవేక్షణ ఉంటుంది.
– టి.సునీల్‌కుమార్‌రెడ్డి, డీవైఎస్‌ఓ

వాహన తనిఖీల్లో రూ.64 లక్షల నగదు సీజ్

ఖమ్మం క్రైం/ఖమ్మంరూరల్: జిల్లాలోని వివిధ మండలాల్లో శుక్రవారం రాత్రి, శనివారం చేపట్టిన వాహన తనిఖీల్లో రూ.64లక్షలకు పైగా నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు కమిషనర్ సునీల్ దత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్ రోడ్డులో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి పత్రాలు లేకుండా ఆర్‌టీసీ బస్సులో తరలిస్తున్న రూ.42,86,290 నగదు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్‌కు చెందిన రజనీకాంత్ ఈ నగదు తరలిస్తూ పట్టుబడ్డాడని తెలిపారు. అలాగే, ఏపీలోని జగ్గయ్యపేటకు చెందిన కారులో తీసుకెళ్తున్న రూ.20లక్షల నగదుతో పాటు 275 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఇక కల్లూరులోని పెరువంచ అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో తిరువూరు మండలం మునుకుళ్ల నుండి ఖమ్మం రూరల్ పెద్దతండా ఓ వ్యక్తి తీసుకొస్తున్న రూ.1,65,000 నగదు సీజ్ చేసినట్లు తెలిపారు. అంతేకాక రూ.18వేల విలువైన మద్యాన్ని సీజ్ చేశామని చెప్పారు. ఏసీపీల పర్యవేక్షణలో సీఐలు, ఎస్ఐల ఆధ్వర్యాన 200మంది సిబ్బంది తనిఖీలు కొనసాగుతున్నాయని, ఎన్నికల నిబంధనలకు మేరకు 50వేలకు మించి నగదు తీసుకెళ్తే సంబంధిత పత్రాలు సమర్పించాలని సీపీ సూచించారు.


స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి


పున్నారావు (ఫైల్)

మధిర: మధిరలోని మార్కెట్ యార్డు సమీపాన శుక్రవారం సాయంత్రం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వెల్దుర్తిపాడుకు చెందిన పున్నారావు(45) తన భార్యను ఓ ఫంక్షన్‌కు పంపించి ఆయన ఆగిపోయాడు. ఆతర్వాత ఎంతకూ రాకపోవడంతో బంధువులు వెతకటం ప్రారంభించారు. ఇంతలోనే పున్నారావు వైన్స్ షాపు పక్కన మార్కెట్ యార్డు స్థలంలో రైతువేదిక పక్కన విగత జీవిగా కనిపించాడు. అయితే, ఆయనకు మద్యం అలవాటు ఉన్నట్లు చెబుతుండగా.. పున్నారావు శరీరంపై గాయాలు ఉండడంతో ఆయన బంధువుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మధిర టౌన్ ఎస్సై సంధ్య తెలిపారు.

మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య


ఖమ్మంక్రైం: మద్యానికి బానిసై తిరుగుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం త్రీ టౌన్ సీఐ రమేష్ కథనం ప్రకారం.. పంపింగ్ వెల్ రోడ్డు ప్రాంతానికి చెందిన దొడ్డా శ్రీనివాస్(45) గతంలో వ్యవసాయ మార్కెట్‌లో పనిచేసేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసైన ఆయన శనివారం మధ్యాహ్నం హర్కారబావి సెంటర్‌లోని వైన్స్‌లో మద్యం కొనుగోలు చేసి అందులో ఎలుకల మందు కలుపుకుని తాగాడు. ఆపై అపస్మారక స్థితిలోకి వెళ్లిన శ్రీనివాస్‌ను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై భార్య శైలజ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి


ఉపేందర్ (ఫైల్)

ముదిగొండ: వ్యక్తిగత సమస్యలతో పురుగులమందు తాగిన యువకుడు చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. మండలంలోని రాఘవాపురానికి చెందిన సాధినేని ఉపేందర్(28) వ్యక్తిగత సమస్యలతో ఈనెల 25న పురుగుల మందు తాగాడు. దీంతో కుటుంబీకులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై ఆయన తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి


మృతి చెందిన ఆవులు

కారేపల్లి: ట్రాన్స్‌కో ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా మూడు ఆవులు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. ఇటీవల వీచిన గాలిదుమారానికి మండలంలోని సూర్యతండా గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, లైన్‌ను సరిచేయకుండానే ఉద్యోగులు సరఫరా చేశారు. దీంతో శనివారం మేతకు వెళ్లిన రైతులు బానోతు రాంచందర్, బాదావత్ హనుమ, బానోతు మోతీలాల్‌కు చెందిన మూడు ఆవులు తీగలను తాకడంతో షాక్‌కు గురై మృతిచెందాయి. ఉద్యోగుల నిర్లక్ష్యంతో ఘటన జరిగినందున తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరారు.

వివాహిత అదృశ్యం

మణుగూరుటౌన్: మండలంలోని బాంబేకాలనీలో వివాహిత కనిపించకుండా పోయిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన సాంబశివరావు రోజూ లాగే ఈ నెల 25వ తేదీన డ్యూటీకి వెళ్లి ఇంటికి వచ్చి చూడగా భార్య అమూల్య (25) కనిపించలేదు. స్థానికుల వద్ద వాకబు చేయగా మధ్యాహ్నం 3 గంటలకు బయటకు వెళ్లినట్లు తెలిపారు. సాంబశివరావు ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

సత్తుపల్లి: మండలంలోని బేతుపల్లికి చెందిన మోహన్ సత్తుపల్లి అంబేడ్కర్ సెంటర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట శనివారం నిలిపిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. దీంతో పాఠశాల సీసీ కెమెరాల పుటేజీని పరిశీలించి ఎర్ర చొక్కా ధరించిన వ్యక్తి వాహనాన్ని తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈమేరకు ఆయన సత్తుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుబాబుల్ తోటలు దగ్ధం

మధిర: మండలంలోని ఖమ్మంపాడుకు చెందిన గడసందుల వెంకటేశ్వర్లు, బండి సీతారామయ్య, కల్యాణపు పూర్ణయ్యతో పాటు పలువురు రైతుల సుబాబుల్ తోటలు శనివారం అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో రూ.10 లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతులు తెలిపారు. పంట పొలాలకు సమీపాన కొందరు చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించినట్లు సమాచారం.

కబేళాకు తరలిస్తున్న పశువుల స్వాధీనం

మధిర: ఎలాంటి అనుమతి లేకుండా హైదరాబాద్ తరలిస్తున్న పశువులను స్వాధీనం చేసుకున్నట్లు మధిర రూరల్ ఎస్సై లక్ష్మీభవాని తెలిపారు. మండలంలోని ఖాజీపురం పాలిటెక్నిక్ కాలేజీ సమీపాన వాహనాల తనిఖీ చేస్తుండగా డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్నట్లు పశువులను గుర్తించామని పేర్కొన్నారు. ఈ మేరకు ఆవులు, ఎద్దులు కలిపి 45 జీవాలను హైదరాబాద్ కబేళాకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్

Education

■ మా వద్ద మాధ్యమ, సాహిత్యరత్న హిందీ పరీక్షలకై, SSC, ఇంటర్, డిగ్రీ, పి.జి., MBA, MCA, LLB, B.Tech, ఫామ్‌-బి, ఫామ్‌-డి, BSC నర్సింగ్, ANM, GNM, 2023-25 సం॥ B.Ed. కొరకు. సంప్ర॥ 7396250709, కోదాడ. [M-1185053]

Real Estate

■ ఖమ్మం - సూర్యాపేట హై వే కి తల్లంపాడు నందు ఓపెన్ ప్లాట్స్ మరియు ఫార్మ్‌హౌస్‌లు కలవు. వివరాల కోసం 9491650500. [M-1233974]

FLAT FOR SALE

■ ఖమ్మం, మమత హాస్పిటల్ వద్ద విలాసవంతమైన 3 బెడ్ రూమ్స్ తూర్పు ఫేసింగ్ ఫ్లాట్స్ అన్ని వసతులతో అమ్మబడును. బుకింగ్స్ ఓపెన్. చంద్రశేఖర్ డెవలపర్స్-90104 81234. [M-1233963]

PLOT FOR SALE

■ ఖమ్మం, ఇల్లందు రోడ్, శ్రీకృష్ణుడి గుడి రోడ్‌లో, మెయిన్ రోడ్‌కి దగ్గరలో 220 చ॥గ॥లలో నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ (2BHK) ఇల్లు అమ్మకమునకు కలదు. సెల్ : 98484 91758 [M-636]

■ ఇల్లందు రోడ్, శివాయ్‌గూడెం S.N మూర్తి కాలేజ్, రఘునాథపాలెం, చింతగుర్తి, YSR కాలనీ ఓనర్ ప్లాట్లు అమ్మకానికి కలవు. YSR. Ph: 9390189907 [H-799843]

TO-LET

■ ఖమ్మంలో 2 BHK 1st Floor ఫ్లాట్ నెం. G5 వరదయ్య టవర్స్, మమత హాస్పిటల్ రోడ్, ముగ్గా షాపు ఎదురుగా ఉన్న ఇల్లు అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 80741 67776, 99590 77678. [M-1185054]

Services

PACKERS & MOVERS

■ మీరు ఇల్లు మారుతున్నారా ! గాయత్రి ప్యాకర్స్ & మూవర్స్, ఖమ్మం. (All Over India) హౌజ్ కీపింగ్ సౌకర్యం కలదు. ఖమ్మం సంప్ర॥ సెల్ : 9247881187. [M-1185035]

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మిషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు. 9310515624, 8800496710 [G-1468]

Wanted

■ ఖమ్మం త్రీ టౌన్ మరియు రూరల్ ఏరియా నుండి స్కూల్‌కి అడ్మిషన్ కొరకు PROలు కావలెను. ఆసక్తి కలవారు సంప్రదించండి వివరాలకు 9491650500. [M-1233975]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217 [M-1185056]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/ వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 20K. Ph: 8977639662 / 8977639663 [H-799874]

■ ఖమ్మం బ్యాంక్ వాల్యూర్ ఆఫీస్‌లో పనిచేయుటకు డిప్లొమో సివిల్ / B.A, B.Sc క్యాండిడేట్స్ ఫీల్డ్‌స్టాఫ్ కావలెను. ఫోన్ : 95057 99599 [V- 786801]

■ Wanted Securityguards Urgently male at Khammam. Rs. 13,000/- Net Wages PF & ESI Available 12 Hours duty, per month. 10th Pass, Age : 45 below. Ph : 85229 54707, 75691 23279 [V- 12030]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182
9010299957